# గీత దాటని సీత

ఎమ్. వెంకటేశ్వరరావు

**ఆటో వేగంగా వచ్చి రైల్వేస్టేషన్ ముందాగింది. అదే వేగంతో సూట్‌కేస్‌తో బయటకు దిగింది సీత. ఆటో ఫేర్ చెల్లించి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఐదో నెంబర్ ప్లాట్‌ఫాం వైపు నడిచాయామె కాళ్ళు. హిగిన్‌బాథమ్స్ బుక్ స్టాల్ ప్రక్కన్నుంచుని పరిసరాల్ని గుండ్రంగా చుట్టాయామె కళ్ళు ఎవరినో వెతుకుతున్నట్లుగా. ఆ స్టాల్ వెనగ్గా తనక్కొంచెం దూరంలో నుంచుని ఎవరితోనో మాట్లాడుతున్న అతన్ని పోల్చుకున్నాయి. వెతికి వెతికి అలసిన ఆమె కళ్లల్లో అతన్ని చూసిన ఆనందం. ఆ సంతోషంలో వేగంగా పిలవబోయిన ఆమె నోటికి తాళం వేశాయి చెవుల్ని చేరిన అతని మాటలు.**

అంతే...చేష్టలుడిగిన దానిలా చెవులప్పగించింది. విన్పిస్తున్న మాటలకు మనసు విస్ఫోటనం చెందనారంభించింది. ఆ విస్ఫోటనంలో విడుదల అవుతున్న లావా వళ్లంతా మంటలు పుట్టిస్తోంది. మౌనంగా నుంచునే పళ్ళబిగువున నాలుగు నిముషాలు భరించింది. సరిగ్గా ఐదో నిముషంలో విన్పించిన మాటలకు చెవులు బ్రద్ధలై మనసు ముక్కలవుతున్నట్లన్పించింది. అసహ్యం అపహాస్యం చేయనారంభించింది.

ఒక్కక్షణంలో ఉద్భవించిన ప్రశ్న ''ఇందుకా? ఇంత దూరం వచ్చింది?'' అంతే...వచ్చిన వేగంతోనే వెనక్కి తిరిగాయామె కాళ్ళు. వేగంగా మెట్లెక్కుతున్న ఆమెకు చెప్పులు స్లిప్పయి కాలి బొటన వేలు ముందుకు కొట్టుకుంది. చర్మం చిట్లి రక్తపు ఊట ఆరంభమయింది. మనసును మెలిపెడ్తున్న బాధ, కాలి గాయపు బాధను కప్పేసింది. గబగబా బయటకొచ్చి ఆటోలో కూలబడింది.

''ఎక్కడికి పోవాలమ్మా?'' అనడిగిన ఆటో అతనికి అడ్రస్ చెప్పి అచేతనంగా వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది. అప్పటివరకూ ఆగిపోయిన ఆలోచనలకు చైతన్యమొచ్చి మూసుకున్న ఆమె లోచనాల వెనక నండి వెంబడించసాగాయి. పదే పదే చెవుల్లో మార్మోగుతున్న అతని మాటలు, మనసు గతపు తలపుల్ని త్రవ్వుతుంటే వాస్తవం వద్దని వెనక్కి తిప్పికొడ్తోంది.

పదిహేను నిముషాల తరువాత ఆటో ఆగిన శబ్దానికి అస్తవ్యస్తపు ఆలోచనల నుండి బయటకు దిగింది. అదురుతున్న కాళ్లతో, అడుగులో అడుగేసుకుంటూ వణికే చేతులతో గేటుమీద చెయ్యేసింది.

అంతే...చేతిలో వున్న సూట్‌కేస్ జారిపడ్డది. ఎండ ఎండిపోతున్నా వళ్లంతా వర్షంలో తడిసినట్టు చెమటలలుముకోసాగాయి.

లోపల్నించి విన్పిస్తున్న ఏడుపులు...శాశ్వత నిద్రలో వున్న తండ్రి శవం, పక్కనే కూచుని తల్లి పెడ్తున్న శోకాలు శాపాల్లా విన్పించసాగాయి.

పక్కన్నుంచున్న వాళ్లలో ఒకామె-

''కూతురు ఎవరితోనో లేచిపోయిందిట. అవమానం భరించలేక ఆ విషయం ఊరందరికీ తెలిసిందని తనకు తెలియకముందే ఆత్మహత్య చేసుకున్నాట్ట పాపం...''

కాళ్ళకింద భూమి బ్రద్ధలవుతున్నట్టన్పించింది సీతకి.

ఆపై ఒక్క నిముషం నిలబడనీయలేదు ఆమెలో కట్టలు తెంచుకున్న దుఃఖం.

''డాడీ'' అంటూ గేటు పూర్తిగా తెరచి లోపలకి రెండడుగులు వేసిన ఆమె కళ్ళు ఏదో మిరకల్ చూస్తున్నట్లు రెప్పవాల్చడం మర్చిపోయాయి. కాళ్ళు బంధించినట్టు స్తంభించిపోయాయి. చేతిమీద గిల్లుకుంది. నొప్పి తెల్సింది. కళ్ళు నులుముకుని పరీక్షగా చూసింది.

తండ్రి రిటైర్డ్ మేజర్ జనరల్ చంద్రశేఖర్ ఇంటి ముందు ఛేర్‌లో కూచుని పేపర్ చూస్తున్నారు.

క్షణంలో పీడకలగన్న ఆమె కళ్ళు ఎదురుగా కన్పిస్తున్న తండ్రిని చూసేసరికి ఆనందభాష్పాలతో అల్లుకుపోయాయి.

''డాడీ'' అని ఈసారి కాస్త పెద్దగా పిలిచేసరికి పేపర్లోంచి తలపైకెత్తిన చంద్రశేఖర్ కూతుర్ని చూసి ఆశ్చర్యంగా...

''సీతూ! ఏం అక్కడ నిలబడ్డావు? ట్రైనుకెళ్లలా?'' ఆ మాటలు విన్నంతలో వేగంగా వచ్చి తండ్రి పక్కనున్న కుర్చీలో కూర్చునేసరికి నీరసం నిలువెలా ఆవరించిందామెను.

స్వేదం ధారలుగా కారుతుంటే అప్పుడు తుడుచుకుంది.

తండ్రి కుర్చీ పక్కనున్న జగ్‌లో నీళ్ళు గడగడా తాగింది.

''ట్రైన్ మిస్సయింది డాడీ'' నూతిలోంచి వచ్చినట్లున్నాయామె మాటలు.

''పోనీ తర్వాత ట్రైనుకెళ్లలేకపోయావా?''

''తర్వాత రాత్రి ఏడుగంటలకుందట. ఒంటరి ప్రయాణం ఇష్టంలేక తిరిగొచ్చాను.''

''అరే! నీకు భయమా? కొత్తగా మాట్లాడుతున్నావు. నీకేనాడూ పిరికితనం నూరిపోసినట్లు గుర్తురావడంలేదే'' ఆశ్చర్యం నటిస్తూ అంటూంటే-

''ఎంతైనా ఆడపిల్లను కదా డాడీ!''

''ఆడపిల్లలు స్పేస్‌కే వెళ్తున్న ఈ కాలంలో మూడు గంటల ప్రయాణానికి నీకు భయమా? అందున ఈ మేజర్ కూతురివి నువ్వు'' అంటూ నెరిసిన గుబురు మీసాల్ని పైకి నెట్టుకుంటూ మిలటరీ దర్పాన్ని ప్రదర్శించాడు చంద్రశేఖర్.

ఇంతలో సీత తల్లి శారద అక్కడికొచ్చి-

''సీతా! వెళ్లలా?'' ఆశ్చర్యపోతూ.

''ట్రైను మిస్సయిందట. తర్వాత ట్రైనుకెళ్ళే ధైర్యంలేక తిరిగొచ్చింది'' ఉడికిస్తున్నట్లు అంటున్న భర్తతో-

''ఆడపిల్లలు స్పేస్‌కే వెళ్తున్న ఈ కాలంలో మూడు గంటల ప్రయాణానికి నీకు భయమా? అందున ఈ మేజర్ కూతురివి నువ్వు'' అంటూ నెరిసిన గుబురు మీసాల్ని పైకి నెట్టుకుంటూ మిలటరీ దర్పాన్ని ప్రదర్శించాడు చంద్రశేఖర్.

''చాల్లే ఊర్కోండి. వయసులో వున్న పిల్లను ఒంట

రిగా పంపడం చాలక పైగా రాత్రి ప్రయాణం చెయ్యలేదని ఒహటా. ఎలా వెళ్ళొస్తావోనని భయపడి ఛస్తున్నాను. ట్రైను మిస్సయి మంచిదైంది'' అంటూ లోపలికెళ్లింది శారద.

''చూడు సీతూ! మీ అమ్మ అలానే అంటుంది. నువ్వు డేరింగ్‌గా అన్నిట్లో దొచ్చుకుపోతావే! ఈ మధ్య ఎక్కువగా భయం కన్పిస్తోంది నీలో. నేర్పించేది మీ అమ్మేనా?'' అన్నారాయన నవ్వుతూ.

సుడులు తిరుగుతున్న కన్నీళ్ళు తండ్రికి కనిపించకుండా తుడుచుకుని మౌనంగా కూచుంది.

''ఎనీవే...యూ నీమ్ టు బి అప్సెట్. గో అండ్ రిలాక్స్...

లేవబోతుంటే...

''సీతూ! క్లోజ్ ఫ్రెండ్ మేరేజ్ కెళ్లాలన్నావని అలా అన్నాను. ఐనో మై డాటర్. గో...గో అండ్ టేక్ రెస్ట్.''

తండ్రి మాటలు వింటున్నకొద్దీ కళ్ళ వెనకున్న కన్నీళ్ళు ఆగలేమంటూ బయటకు రాసాగాయి.

తనపై తండ్రికున్న నమ్మకాన్ని వమ్ము చేయడానికి సిద్ధపడి ఓడిపోయి తిరిగొచ్చిందని ఆయనకు తెలిస్తే తట్టుకోగలడా? సీత మనసు మౌనంగా ప్రశ్నించిం.

లేచి తన గదిలోకెళ్లింది.

• • •

మంచంమీద పడుకున్న సీతకు స్రవంతి కళ్లముందు కదలాడింది.

అంతకుముందు రోజు తన మనసు తెరిచి స్రవంతికి రాసిన లెటరు సంగతి గుర్తుకొచ్చి లేచి హేండ్‌బేగ్‌లోంచి తీసింది. రైల్వేస్టేషన్‌లో పోస్టు చేద్దామనుకుని మర్చిపోయింది. మర్చిపోవడమే మంచిదైందనుకుంది. ఆ లెటర్ చించేసి మళ్లీ లెటర్ రాయడం మొదలుపెట్టింది.



సీతతోపాటు కెజి నుండి పిజి వరకు కల్సి చదివింది స్రవంతి. సీత బాంకు జాబులో జాయినైతే స్రవంతి రైల్వేలో చేరింది. ఇటీవలే ఇల్లాలైంది.

• • •

స్రవంతీ!

ప్రతి పనీ ఎంతో ఆలోచించి మరీ నిర్ణయాలు తీసుకునే నేను ఈ విషయంలో ఎందుకు తొందరపడ్డానా ఎంత ఆలోచించినా అవగతం కావడంలేదు.

ఆ తొట్రుపాటు ఫలితం...కొన్నాళ్ళుగా నేననుభవిస్తున్న ఉద్వేగానికి చివరికి ప్రేమ అనే ముసుగు తొడగాల్సి వచ్చింది.

'ఐ లవ్ యూ' అన్నంత తేలిక కాదేమో ప్రేమంటే.

కొంతమందితో ఏళ్ళ తరబడి గడిపినా కలగని ఆ స్పందన కొంతమందిని చూడగానే ఉద్భవిస్తుంది ఎందుకనో?

ఆ రోజు...

మా బాంక్ మేనేజర్–

''సీతా! హి ఈజ్ ఉమేష్, న్యూలీ రిక్రూటెడ్ ఫీల్డాఫీసర్ టు అవర్ బ్రాంచ్'' అనడంతో చూస్తున్న లెడ్జెర్‌లో నుండి తలపైకెత్తేసరికి ''హలో'' అన్న అతని మాట విన్పించి–

''హలో... ఐయామ్ సీత'' అన్నాను బదులుగా.

మళ్లీ లెడ్జర్‌లో తల దూర్చిన నాకు అతని వాయిస్‌లో ఏదో మార్దవం వున్నట్లనిపించింది.

నా పక్క సీటు భాస్కర్‌కు అతన్ని పరిచయం చేస్తుంటే మరోమారు అతన్ని చూసిన నేను స్మార్ట్ అనుకున్నాను మనసులో.

ఇయరెండింగ్ బిజీవల్ల తర్వాత అతన్నంతగా పట్టించుకునే సమయం, సందర్భం కలగలేదు.

## అందుకు

''మీరు విద్యార్థులకు మరీ అంత కఠినమైన హోమ్‌వర్క్ ఇస్తారెందుకని?'' సాటి ఉపాధ్యాయుడ్ని అడిగాడు పంతులయ్య.

దానికా సాటి ఉపాధ్యాయుడు కోపంగా ఇలా అన్నాడు.

''ఇలాంటి వెధవల్ని కని మన మీదకు తోలినందుకు వాళ్ళ నాన్నలమీద కసి తీర్చుకోవడానికి!''

## మార్పు

''ఏంటీ? ఈమధ్య మీ స్నేహితులంతా నీమీద అభిమానాన్ని ప్రదర్శిస్తూ నీతో ఎంతో సన్నిహితంగా వుంటున్నారా? అంటే ఇంతకుముందు అలా వుండేవారుకారా?''

''ఊహూ...''

''మరైతే వాళ్ళల్లో ఇప్పుడిలాంటి మార్పెందుకొచ్చింది?''

''మార్పొచ్చింది వాళ్ళలో కాదు. నాలో. నేనిప్పుడు కవితలు రాయడం మానేశాను.''

## ఇంటర్‌వ్యూ

కండక్టర్ పోస్టుకి ఇంటర్‌వ్యూకెళ్ళొచ్చిన కన్నారావ్‌నడిగాడు హన్నారావ్.


''ఇంటర్‌వ్యూ ఎలా జరిగింది? కఠినంగా వుందా?''

''ఎబ్బే...చాలా సింపుల్‌గా జరిగింది. క్యాండిడేట్స్ అందరి చేతికీ పది రూపాయల నోట్లిచ్చి తొమ్మిది రూపాయలు తీసుకుని ఒక్క రూపాయి తిరిగి ఇమ్మన్నారు.''

''ఆ తర్వాత?''

''ఏముందీ? రూపాయి ఇచ్చిన వాళ్ళందర్నీ పంపించేసి 'చిల్లరలేదు' అన్నవాళ్ళందర్నీ సెలెక్ట్ చేసేసారు.''

-**భానుకిరణ్** (సీతాఫల్‌మండి)




మా బ్రాంచీలో యామిని, నేను ఇద్దరమే ఆడవాళ్ళం.

యామినికి పెళ్ళయి పిల్లలు కూడా. అయినా మిస్ ఇండియా లెవెల్లో శరీర పోషణతో నవనవలాడుతూ...పెళ్లి కాలేదంటే నమ్మేలా వుంటుంది. కొత్తగా వచ్చిన ఉమేష్ డ్రెస్సింగ్ సెన్స్, పట్టీ పట్టి మాట్లాడే ధోరణీ చూసి అతనితో చనువు పెంచుకోవాలని తహతహలాడేది.

రెణ్ణెలు గడిచాయి. అందరికీ అతనితో చనువు పెరిగింది ఒక్క నాతోతప్ప.

సహజంగా అమ్మాయిలతో పరిచయం పెంచుకోవాలని వెంపర్లాడే అందరి మగాళ్ళలా కాక అడిగిందానికి మాత్రమే బదులిచ్చే అతని రిజర్వ్‌డ్‌నెస్, స్ఫురద్రూపం (మగాళ్లలో నేను కోరుకునే లక్షణాలు కాబోలు) చూస్తున్నకొద్దీ నాలో అంతర్లీనంగా మొదలైన ఆరాధన అతనితో పరిచయం పెంచుకొమ్మని తొందర చేసింది.

బాంకుకెళ్లగానే అతనికోసం కళ్ళు తహతహలాడేవి. ఎప్పుడైనా అతను కనిపించకపోతే తల్లడిల్లిపోయేవి.

''ఎందుకో....ఏమో? ఇందుకూ' అని ఇదమిద్ధంగా చెప్పలేని అనిర్వచనీయమైన అనుభూతి.

ఆ అనుభూతి అధికమై అతనితో మాట్లాడేలా చేసింది. ఆ పరిచయం క్రమంగా సాగి దగ్గరై 'పరిచయమై' మరో నాలుగు నెలల్లో ప్రణయంగా మారింది. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడని అతని మూడీనెస్ మాయమై బోల్డంత బోల్డ్‌నెస్ వచ్చేసింది నా దగ్గర.

బాంకులో గుసగుసలతో ప్రచారం కొనసాగింది. వాళ్లందరి నోళ్లల్లో నలిగిపోకముందే ఒక ఆడపిల్లగా నేనాశించే ముగింపు అతనిముందు వుంచాను.

''తొలిచూపులోనే నా పంచప్రాణాలూ నీలో బందీ చేసాను. ఇక నా ఆరోప్రాణమైన నువ్వు ఎప్పుడు గ్రీన్ సిగ్నలిస్తావా అని ఎదురుచూస్తున్నాను'' అని అతను అన్నప్పుడు పున్నమి చంద్రుడ్ని అందుకోవాలని ఎగిసిపడే కెరటాల్లా మనసంతా మరులుగొల్పుతున్న భావన.

ఆ స్థితిలో మరికొంతకాలం ముందుకు దొర్లుతూ వింత వింత అనుభూతుల్ని అందించింది. అనుభూతులు హద్దులు దాటకవుందే హద్దు ఏర్పరచుకోవాలనీ, పెద్దల సమ్మతంతో ఒకటవుదామన్నాన్నేను.

''మా పేరెంట్స్‌ని కన్విన్స్ చేయడం కష్టం'' అన్నాడతను.

''పోనీ ముందు మా ఇంట్లో చెప్పి వాళ్లద్వారా మీ వాళ్ళను ఒప్పిద్దాం'' అన్నాన్నేను అమ్మానాన్నలు కాదనరన్న నమ్మకంతో.

''మీ పేరెంట్స్ ఈ కాలపు తల్లిదండ్రుల్లా అంగీకరించి మావాళ్ళముందుంచినా మావాళ్ళు పాతకాలపు భావాలు పాతుకుపోయిన మనుషులు. మీవాళ్ళు ఔనని, మావాళ్ళు కాదనీ పెళ్లికి ముందే రసాభాస అయ్యేకన్నా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని ఇద్దరి ఇళ్లల్లో ఇన్‌ఫాం చేద్దాం. ఆ తరువాత ఆశీర్వదించినా, అసహ్యించుకున్నా మనమిద్దరం ఒకరి ఫీలింగ్స్ మరొకరు షేర్ చేసుకుంటూ జీవితం సాగిద్దాం'' అని నన్ను ఒప్పించాడతను.

చిన్నతనం నుండి నా అభిప్రాయాల్నీ, అవసరాల్నీ గుర్తించి అంగీకరించే తల్లిదండ్రులకు తెలీకుండా జీవితంలో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంటున్నందుకు మనసు గిల్టీనెస్‌తో గుంజుకుంటున్నా అతని ఆకర్షణ అదిమిపెట్టింది.

ఏనాడూ అబద్ధం చెప్పని నేను, అతని పరిచయం అయిన దగ్గరనుండి ఇంట్లో చెప్పే ప్రతి మాటా అబద్ధంగానే అన్పించసాగింది.

రిజిస్టర్ మేరేజ్‌కి డేట్ ఫిక్స్ చేసుకుని ఆ రోజు మధ్యాహ్నం రైల్వేస్టేషన్‌లో కలుద్దామని నిర్ణయించుకున్నాం.

రెడీమెడ్‌గా ఆలోచించి వుంచుకున్న అబద్ధాన్ని అమ్మానాన్నల కప్పగించి కొంత డబ్బు తీసుకుని రైల్వేస్టేషన్‌కొచ్చి అతన్ని చూసిన నన్ను మూగదాన్నిచేశాయతని మాటలు.

నాక్కొంచెం దూరంలో నుంచుని ఎవ్వరితోనో మాట్లాడుతున్నాడు ఉమేష్.

''అయితే లవ్ మేరేజ్ అన్నమాట. కంగ్రాట్స్. మరి మీ ఇంట్లో తెల్సా?''

తెలీదన్నట్లు తలూపాడు ఉమేష్.

''మరి మీ నాన్నూరుకుంటాడా? పోయినసారి నాక్కల్సినప్పుడు నీకు రాజమండ్రిలో సంబంధం కుదిరిందనీ, మూడులక్షలదాకా ఇస్తారని చెప్పారు'' అన్నాడతను ఆశ్చర్యంగా.

''ఆయనలాగే చెప్తాడు. బంగారు గుడ్లుపెట్టే బాతు రోజుకో గుడ్డు పెడితేనే మనకు లాభంగానీ అన్నీ ఒకేరోజు పెట్టేసి కూర్చుంటే తర్వాత దాన్ని పోషించడంవల్ల మనకొరిగేదేముంది?''

''అంటే...'' అర్థం కానట్టు అడిగాడు ఉమేష్ ఫ్రెండు.

''కట్నం రూపంలో ఒకేసారి లక్షలు తెచ్చే ఉద్యోగం లేని పిల్లని చేసుకునేకన్నా జీవితాంతం ప్రతినెలా అక్షయపాత్రలా జీతం తెచ్చి దోసిట్లో పోసే జాబ్ చేసే అమ్మాయిని చేసుకోవడం.''

ఆ మాటలు వస్తున్నది ఉమేష్ నోటినుంచేనా? వింటున్న నాకు అసహ్యం మనసునావరించింది. నేనింకా రాలేదని కాబోలు పదే పదే వాచ్ చూసుకుం

టున్నాడు.

''సిగరెట్'' ఆఫర్ చేసాడు ఉమేష్ ఫ్రెండు.

''వైనాట్'' అని వెలిగించాడు.

ఎటువంటి దురలవాట్లులేవనీ, ఉత్తమ పురుషుణ్ణనీ నాతో చెప్పిన అదే నోటినుండి వస్తున్న పొగ అతని మాటల్లోనే గాల్లో కల్సిపోసాగింది.

''మరి ఆ గీతనేం చేస్తావురా? నిన్నే నమ్ముకుంది పాపం. పైగా ప్రెగ్నెంటని విన్నాను.''

ఆ మాట విన్న నాకు అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నట్లనిపించింది.

''సీత గీత దాటాక ఏమయిందిరా? ఇప్పుడు ఈ గీతకూ అదే అవుతుంది. కొన్నాళ్ళు కష్టపడుతుంది. ఆ తర్వాత ఎవణ్ణో ఒకడ్ని కట్టుకుంటుంది. ఏదో వెంట పడ్డదని కాలక్షేపంకోసం కౌగలించుకుంటే కడుపొచ్చింది. అంతమాత్రాన ఈ బంగారు బాతును వదులుకోమంటావా? ఆ గీతను చేసుకుంటే దండల మార్పిడి ఖర్చు కూడా నేనే భరించాలి బ్రదర్. ఆర్డినరీ గుమస్తా కూతురు. పోనీ ఉద్యోగమన్నా వుంటే అడ్జస్టయ్యుండేవాడ్ని.''

నాలుగు నిముషాలు అతని మాటలు భరించిన నేను చివరి నిముషంలో విన్పించిన పై మాటలు విని తట్టుకోలేక తిరిగొచ్చాను.

చూడు స్రవంతీ! నీకింకో విషయం చెప్పాలి.

రెణ్ణెల్లక్రితం డాడీ డియరెస్ట్ ఫ్రెండ్ రాజారావం కుల్ కూతురు రమ్య ఇంట్లో తెలీకుండా తానెంచుకున్న వాడితో తాళి కట్టించుకుని వెళ్ళిపోయింది. రిటైర్మెంట్ డబ్బుతో కూతురి పెళ్లిచేసి పంపుదామనుకుని సంబంధాలు చూస్తున్న అంకుల్ కూతురు చేసిన అవమానాన్ని తట్టుకోలేక అనారోగ్యం పాలయ్యారు. నెలరోజులు తిరక్కముందే మోజుతీరి డబ్బు తెమ్మని భర్త పెట్టే హింసలు తట్టుకోలేక భయపడి పారిపోయి ఇంటికొచ్చింది రమ్య. ఇంటికొచ్చిన కూతురికి ఇంట్లో చోటివ్వాలో, వద్దో పాలుపోక సలహా కోసం డాడీ దగ్గరకొచ్చిన అంకుల్‌తో...

చూడరా రాజా!

ఈ జనరేషన్ అసలిలా ఎందుకు తయారవుతోందో అర్థం కావడంలేదు.

పుట్టిన దగ్గర్నుంచి వయసొచ్చేవరకూ తల్లిదండ్రులతో, తోబుట్టువులతో అన్ని విషయాల్లో పంచుకుని పెంచుకున్న ప్రేమానుబంధాల్ని తెంచుకుని పాతికరోజుల పరిచయానికి ప్రేమ ముసుగుకప్పి బయటికి పోయి బలవుతున్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్ అవ్వాలనో, ఇంజనీర్ అవ్వాలనో, తమ కూతురికి మంచి భర్తను తేవాలనో...ఇలా తమ బిడ్డలు తమకన్నా పై స్థాయిలో ఉండాలని కోరుకుంటారేతప్ప తమకు తెలీకుండా ఎవర్నో ఒకర్ని ఎంచుకుని తమపై బాధ్యత మోపకుండా పెళ్లిళ్ళు చేసుకెళ్లిపోవాలని ఆశించరు.

నాకు ఫలానా డ్రెస్ కావాలి, ఫలానా చదువు కావాలని, ఫలానాదైతే తింటానని ప్రతి దానికీ తల్లిదండ్రులపై ఆధారపడే అదే పిల్లలు యుక్తవయస్సు రాగానే నేను ఫలానావాణ్ణి ప్రేమించాను, ఫలానా అమ్మాయిని చేసుకుంటానని తల్లిదండ్రులముందు ధైర్యంగా చెప్పడంలో ఎందుకు ఫెయిలవుతున్నారో అంతుబట్టని విషయం.

తమ అవసరాలెన్నింటినో త్యాగంచేసి అన్నీ ప్రొవైడ్ చేసి పెంచుకున్న పిల్లలు వయసొచ్చాక తమ త్రోవ తాము చూసుకుని వీడిపోతుంటే రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోతోందని బాధపడాలా? లేక తమ బరువు బాధ్యతలు తప్పిపోయాయని సంతోషపడాలా?

ఆవేశపు అవసరంలో పిల్లలు తీసుకునే నిర్ణయాలు వాళ్ళకెప్పుడూ సరైనవిగానే కన్పిస్తాయి.

ఒక తల్లి కడుపున పుట్టి ఒకచోట కలసి పెరిగే అక్క చెల్లెళ్ళకూ, అన్నదమ్ములకూ అభిప్రాయాల్లో, అభిరుచుల్లో ఎన్నో వ్యత్యాసాలుంటుంటే ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి కొద్దిరోజుల పరిచయానికే అభిరుచులు, అనుబంధాలు పెనవేసుకుని పోతాయనుకుంటున్నారు.

నెవ్వర్! అదెంతవరకు...శరీరతాపాలు తీరేంతవరకే. ఆ తరువాత ఎదురయ్యే సమస్యలను ధైర్యంగలవాళ్ళు ఎదురీదుతున్నారు. లేనివాళ్ళు తమ తొందరపాటుకు తామే బాధ్యులమనుకుని జీవచ్ఛవాల్లా గడుపుతున్నారు.


కాబట్టి రాజా! జరిగిందేదో జరిగిపోయింది. కడుపున పుట్టిన వాళ్ళు తెంచుకున్నంత తొందరగా కన్నవాళ్ళం తెంచుకోలేంకదా. ఆవేశం మాని ఆలోచించు. ఇప్పుడు నువ్వు కాదంటే నీ పాతికేళ్ల పెంపకానికి ప్రతిఫలంగా నీ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది తట్టుకోగలవా? వెళ్లి అమ్మాయిని ఇంటికి తీసుకువెళ్లి తన కాళ్లమీద తాను ఆత్మస్థైర్యంతో నిలబడేలా చెయ్యి'' అంటూ డాడీ అనుభవపూర్వకంగా చెప్పిన మాటలు ఆ క్షణాన సబబే అన్పించాయి.

కానీ అప్పటికే అతని పరిచయమవడంతో ఆ మైకంలో డాడీ మాటలు మరుగునపడ్డాయి.

ఈవేళ మేడిపండులాంటి అతని నిజరూపం చూసాక డాడీ మాటలు చెవుల్లో పదేపదే మార్మోగుతుంటే క్షణికావేశంలో వివేకం కోల్పోయి ఉమేష్ లాంటి వాళ్ళకి బలి అవకుండా 'గీత దాటని సీత'లా తిరిగొచ్చాను.'' లెటర్ రాయడం ముగించిన సీతకు మనసు తేలిక పడ్డది. చాలా కాలం తరువాత ఆ రోజు రాత్రి నిద్ర ఆమెని హాయిగా హత్తుకుంది.

★

## క్లియోపాత్రా పేరుతో రాతి స్తంభాలు



ఈజిప్టులో ఒబిలిస్క్స్ అనే పెద్ద పెద్ద ప్రాచీన రాతి స్తంభాలను 'క్లియోపాత్రాస్ నీడిల్' అంటారు. పందొనిమిదో శతాబ్దంలో ఈజిప్టు పరిపాలకులు బహూకరించిన ఈ స్తంభాలు వరుసగా న్యూయార్క్ నగరం సెంట్రల్ పార్కులో ఒకటి, లండన్ నగరం థేమ్స్‌నది గట్టుమీద ఒకటి, పారిస్ ప్లేస్ డిలా కాన్‌కోర్డ్‌లో ఒకటి ఏర్పాటు చేసారు. అరవై తొమ్మిది అడుగుల ఎత్తు, ఏడున్నర అంగుళాల పీఠం కలిగి, రెండు వందల టన్నులు బరువుండి న్యూయార్కు నగరంలో ఉన్న స్తంభం మూడు వేల సంవత్సరాల కన్న పురాతనమైంది. దీన్ని ఈజిప్టు నుండి తెచ్చారు.

## జలాశయాలను పసిగట్టే 'ఒంటె'

ఎడారిలో ప్రయాణానికి 'ఒంటె' చాలా అనుకూలంగా వుంటుంది. అందుకే ఈ జంతువుని 'ఎడారి ఓడ' అన్నారు. బాగా భారం వేసిన ఒంటె కూడా, మలమల మాడిపోతూన్న కటిక ఎడారిలో ఒక్క నీటి చుక్కైనా తాగకుండా రెండు వందల మైళ్ళు నడుస్తుంది. ఒంటెకు జఠర భాగంలో మిలియనుల కొద్దీ చిన్న చిన్న నిల్వ కణాలు ఉంటాయి. వీటిలో వారందాకా నీటిని నిల్వ చేసుకుంటుంది. ఒంటె ఆహారం లేకుండా కూడా చాలా రోజులపాటు జీవించగలదు. దీని వీపున ఉండే మూపులో కొవ్వు పొరలు పొరలుగా వుంటుంది. దీనికి పసిగట్టే శక్తి మిక్కిలి బ్రహ్మాండంగా వుంటుంది. ఎన్ని మైళ్ళ దూరంలో ఉన్నా భూగర్భ జలాశయాలను ఒంటె ఇట్టే పసిగడుతుంది.

- జి.శారద

